# పోడు భూముల్లో దర్జాగా సాగు

- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 74మంది రైతులకు పట్టాలు
- నెరవేరిన దశాబ్దాల కల

నేరేడుచర్ల, సెప్టెంబర్ 18 : పోడు భూములపై హక్కులు కల్పించాలనే గిరిజనుల చిరకాల స్వప్నాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాకరం చేసింది. దీంతో వారు ఆనందంగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 74మంది రైతులకు ప్రభుత్వం 83.37ఎకరాల భూమిని పంపిణీ చేసింది. మఠంపల్లి మండలంలో 38మంది రైతులకు 37.3ఎకరాలు, పాలకవీడు మండలంలో 36మంది రైతులకు 46.34ఎకరాల భూమి పట్టాలను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి లబ్ధిదారులకు అందించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాలించిన ఏ నాయకులు తమ బాధలను పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తమ బాధలను అర్థం చేసుకుని పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పోడు భూములకు పట్టాల పంపిణీతో రైతులు సంబురంగా సాగు చేసుకుంటున్నారు. గతంలో నిత్యం అధికారులతో పోరాటాలు, ఘర్షణలు తప్ప సరిగా పంటలు పండించుకున్న పరిస్థితి లేదని, ప్రస్తుతం ఆనందంగా సాగు చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు.



పోడు భూములకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి(ఫైల్)

### ఓటుతో కేసీఆర్ సార్ రుణం తీర్చుకుంటాం



ఎన్నో ఏండ్లుగా పోడు భూములు సాగు చేసుకొంటున్న మమ్మల్ని గుర్తించి పట్టాలు ఇచ్చిన సీఎం కేసీఆర్ సార్, ఎమ్మెల్యే సైదిరెడ్డికి ఓటు వేసి రుణ తీర్చుకుంటాం. చెన్నాయిపాలెం తండాలో నేను సాగు చేసుకుంటున్న ఎకరం భూమికి పట్టా ఇచ్చారు. గత ప్రభుత్వాలు గిరిజనులను ఓటు బ్యాంక్‌గా చూడడం తప్ప చేసిందేమీ లేదు. సీఎం కేసీఆర్ సార్ వచ్చినంకనే గిరిజనుల జీవితాలు బాగుపడ్డాయి. మా ప్లిలలకు గిరిజన గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి మంచి విద్యను అందిస్తున్నారు. మా తండాలను గ్రామ పంచాయతీలు చేసి అభివృద్ధి చేశారు. ఎక్కడా నయాపైసా ఇవ్వకుండా పోడు భూములకు పట్టాలు ఇవ్వడం సంతోషంగా వుంది. ప్రభుత్వం, సీఎం కేసీఆర్ సార్ మాకు చేసిన మంచిని మరువం.

– మాలోతు సైదానాయక్, చెన్నాయిపాలెం గ్రామం, మఠంపల్లి మండలం

### ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్

రాష్ట్రంలో ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్. గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోని పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. సాహసోపేత నిర్ణయం తీసుకొని పోడు రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ఎంతో విలువైన భూములకు పట్టాలు ఇచ్చారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకెళ్తున్నది. పోడు రైతులు వ్యవసాయం చేసుకుంటూ లాభాలు సాధించాలి. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. నిరంతరం ప్రజల మధ్యనే ఉండే నన్ను ఆశీర్వదించి గెలిపించాలి.

– శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్యే హుజూర్‌నగర్

## రాజకీయ దురుద్దేశాలతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- బీఆర్‌ఎస్ నాయకులు నాగార్జునాచారి, మోసిన్‌అలీ

మిర్యాలగూడ, నవంబర్ 18 : ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి మిల్లులకు వెళ్తే.. వాటిపై ఐటీ దాడుల వల్ల కొనుగోళ్లు నిలిచి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఇబ్బందులు తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర వస్తున్న తరుణంలో ఐటీ దాడుల వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధిస్తూ రైతులు సంతోషంగా ఉన్న సమయంలో రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఐటీ దాడులు చేయించడం సరికాదన్నారు. రైతులకు సాయం అందించడానికి ప్రతిపక్ష పార్టీలతో పాటు ఐటీ అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. మోసిన్‌అలీ, ఏఎంసీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, బీఆర్‌ఎస్ వేములపల్లి మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు పోకల రాజు, చిర్ర మల్లయ్యయాదవ్, పాలుట్ల బాబయ్య, చౌగాని భిక్షం, మిర్యాల మధుసూదన్, రామకృష్ణ, కరీం, పెండాల్య పద్మ, కోదాటి రమ పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి

హుజూర్‌నగర్, నవంబర్ 18 : అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని ఎన్నికల అధికారి జగదీశ్వర్‌రెడ్డి, వ్యయ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ సూచించారు. శనివారం వారు పట్టణంలోని కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థుల కార్యాలయాలను పరిశీలించి వ్యయ, ఖర్చులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అభ్యర్థులు ఖర్చుల వివరాలను విధిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. క్రిమినల్ కేసులు ఉన్నవారు పత్రికల్లో , టీవీల్లో మూడు సార్లు తప్పకుండా ప్రచురించి ఆ ఖర్చు వివరాలు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

## 30క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

హుజూర్‌నగర్, నవంబర్ 18 : మఠంపల్లి చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఏపీ రాష్ట్రం చిత్తూరు నుంచి వరంగల్‌కు లారీలో తరలిస్తున్న 30క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పట్టికను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి లారీని సీజ్ చేయడంతో పాటు, డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. తనిఖీల్లో మఠంపల్లి సివిల్ ఎస్ఐ బాలకృష్ణ , ఎక్సైజ్ ఎస్ఐలు జగన్‌మోహన్‌రెడ్డి, దివ్య, వెంకన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన నల్లబెల్లం నిందితుడితో ఎక్సైజ్ అధికారులు



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

### ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

మేళ్లచెర్వు, నవంబర్ 18 : మండల కేంద్రంలోని ఐడీయల్ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణకుమార్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మైహోం సిమెంట్స్‌లో స్వచ్ఛతా పక్షోత్సవాలు

మేళ్లచెర్వు, నవంబర్ 18 : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో చేపట్టిన స్వచ్ఛతా పక్షోత్సవాలను ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పరిశ్రమకు చెందిన మేళ్లచెర్వు, వేపలమాధవరం, చౌటపల్లి గనుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మైన్స్ జీఎం శ్రీనివాస్‌రావు, డీజీఎం అప్పలరాజు, ఏజీఎం సూర్యనారాయణరాజు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : కల్మల్‌చెర్వు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు చెక్కులు అందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు

### ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతి

గరిడేపల్లి, నవంబర్ 18 : కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి పథకం కింద మండలంలోని కల్మల్‌చెర్వు జడ్పీహెచ్‌ఎస్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నగదు బహుమతిని పాఠశాల హెచ్‌ఎం నట్టె శ్రీనివాస్‌రావు, కెనరా బ్యాంక్ మేనేజర్ వి.రాజశేఖర్‌రెడ్డి శనివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023– 24 విద్యా సంవత్సరంలో ఆరు, ఏడు తరగతుల్లో ఒకొక్కరికి రూ.2,500, ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల్లో ఒకొక్కరికి రూ.5వేల నగదు బహుమతులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తొగరు వెంకటేశ్వర్లు, జె.రవి, డి.వెంకట్‌రెడ్డి, ఎన్.జగన్, సీహెచ్.పుష్పలత, సీహెచ్.విజయకుమారి, టి.రామ్మూర్తి, బి.శ్రీనివాస్, జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ డే వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

### సీనియర్ విద్యార్థులు మార్గదర్శకంగా నిలవాలి

కోదాడటౌన్, నవంబర్ 18 : సీనియర్ విద్యార్థులు జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ కోరారు. పట్టణ పరిధిలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలో పాల్గొని మాట్లాడారు. కళాశాల నుంచి అనేక మంది సీనియర్లు ఉన్నత లక్ష్యాలకు ఎదిగారన్నారు. జూనియర్లు సీనియర్లను సందేహాలు అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అన్ని సదుపాయలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ గాంధీ, కళాశాల అధ్యాపకులు రమేశ్, స్రవంతి, నరేశ్‌రెడ్డి, జనార్దన్, ఎజాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.